www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 జూన్ 2023
5
తిరుపతి

10-13 తేదీల్లో... తిరుపతిలో సిఐటియు రాష్ట్ర సమావేశాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు సిఐటియు రాష్ట్ర సమావేశాలు తిరుపతి నగరంలో జరగనున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలలో ఏపీలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని, రాష్ట్రంలో నెలకొన్న కార్మిక సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని వివరించారు. సిఐటియు అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ హేమలత, అఖిలభారత నేతలు కరుమాలయన్, ఉమేష్ కుమార్ లతో బాటు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర సమావేశాల జయప్రదానికి జిల్లా ప్రజానీకం సహకరించాలని కోరారు.

తిరుపతి జిల్లావాసులు సురక్షితం : ఎంపి

రైలు ప్రమాద బాధితులకు 'హెల్ప్‌లైన్'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కోరమాండల్ రైలు ఘోర ప్రమాదం నేపథ్యంలో తిరుపతిలో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంపి గురుమూర్తి తెలిపారు. శనివారం రైల్వేస్టేషన్‌కు వెళ్లి 'బాధితులు ఎవరైనా ఉన్నారా? అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే రిజర్వేషన్ వివరాలను పరిశీలించారు. తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ ఎంపి గురుమూర్తికి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తిరుపతి స్టేషన్ నుంచి 18 మంది, రేణిగుంట నుంచి 8 మంది, గూడూరు నుంచి ఇద్దరు కలిపి మొత్తం తిరుపతి నియోజకవర్గ స్థాయిలో 28 మంది ప్రయాణికులు ప్రయాణించారు. వీరంతా సురక్షితంగా ఉన్నారని తెలిపారు. వీరికి అవసరమైన సహాయ సహకారాలు తిరుపతి రైల్వే అధికారులు అందిస్తున్నారని చెప్పారు. అనంతరం రైల్వేస్టేషన్ దక్షిణం వైపున జరుగుతున్న మోడల్ రైల్వేస్టేషన్ పనులను పరిశీలించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి: సిపిఎం, సిపిఐ

ఒడిస్సా రైలు ప్రమాదం అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు మంచి వైద్యం అందించాలని, వారి కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ప్రధాని మోడీ వేగం వేగం అంటూ వేగాన్ని పెంచే రైళ్లు తెస్తున్నామని చెబుతున్నారని, ప్రస్తుతం జరిగిన రైలు ప్రమాదం అత్యంత వేగం వల్లనే జరిగిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైల్వేమంత్రి రాజీనామా చేయాలి : కాంగ్రెస్

ఒరిస్సా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్రరైల్వే మంత్రి రాజీనామా చేయాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్‌చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో మహబూబ్‌నగర్ ప్రాంతంలో జరిగిన దుర్ఘటనకు బాధ్యత వహిస్తూ లాల్‌బహదూర్ శాస్త్రి రాజీనామా చేశారని గుర్తు చేశారు. తిరుపతి రైల్వేస్టేషన్ ముందు కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైల్వే మంత్రి రాజీనామా చేయాలని, ట్యాక్సీడ్రైవర్లు, ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని శనివారం ధర్నా నిర్వహించారు. రైలు ప్రమాదంలో 500మందికి పైగా చనిపోయారని, వందలాదిమంది క్షతగాత్రులయ్యారని, ఇంత పెద్ద రైలు ప్రమాదాన్ని ఎపుడూ చూడలేదన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్ 6281156480 : కలెక్టర్

ఒడిస్సా బాలాసోర్ సమీపంలో సమీపంలో జరిగిన ఘోర రైలు ప్రమాదం సంబంధించి ప్రయాణికుల సమాచారం నిమిత్తం 6281156480 హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సంబంధించిన ప్రయాణికులు ఎవరైనా ఉన్నట్లయితే హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలన్నారు.

తిరుపతి వాసులు క్షేమం

తిరుపతి నుంచి హౌరా కి వెళ్లిన తిరుపతి కి చెందిన ప్రయాణికులు క్షేమంగా ఉన్నట్లు రైల్వే అధికారులకు సమాచారం అందింది. తిరుపతి జిల్లా నుంచి మొత్తం 28 మంది హౌరా కు బయలుదేరగా అందులో తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి 18 మంది క్షేమంగా ఉన్నట్లు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి తిరుపతి రైల్వే అధికారులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. వీరంతా శ్రీకాకుళంలో ఉన్నట్లు సమాచారం. తిరుపతి హెల్ప్ లైన్ కేంద్రం నుంచి వారి బంధువులకు సమాచారం కూడా అందించినట్లు రైల్వే అధికారులు చెప్పారు. మిగిలిన వారి ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు.

గిరిజన బాలికపై అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి
- కీచకుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - బాలాయపల్లి

తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం ఓ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక గర్భం దాల్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు పిగిలాం గ్రామానికి చెందిన ముప్పాళ్ల రవీంద్ర (19) ఓ గిరిజన బాలికకు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. బాలిక శరీరంలోని మార్పులను గమనించిన తల్లిదండ్రులు బాలికను విచారించగా జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో తల్లిదండ్రులు బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముప్పాళ్ల రవీంద్రపై పోక్సోకేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.

ఎన్ని ఆటంకాలొచ్చినా చదవాలి : ఎంఎల్‌సి

జర్నలిస్టుల పిల్లలకు జ్ఞాపికలు

తిరుపతి సిటీ : ఎన్ని ఆటంకాలొచ్చినా కష్టపడి చదవాలని, పైస్థాయికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ చదువే మూలమని ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన జర్నలిస్టుల పిల్లలకు మెమెంటోలతో పాటు నగదు పారితోషకాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ తాను చెట్టుకింద కూర్చుని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి టాపర్‌గా నిలిచానన్నారు. నేటి విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ సాధిస్తున్నారని, మరింత పైస్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. డబ్బు లేదని ఎవరూ చనిపోకూడదని, అలానే చదువు ఆగకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కె డిజిటల్స్ అధినేత సూర్యనారాయణరాజు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జోగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలచంద్ర, ట్రెజరర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్లు శుభ్రంగా ఉంచండి : కమిషనర్

తిరుపతి టౌన్ : తిరుపతి నగరంలోని అన్ని రోడ్లు, వీధులు శుభ్రంగా వుంచాలని కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి కోరారు. మునిసిపల్ కార్పొరేషన్ 42వ డివిజన్లో శనివారం సాయంత్రం కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, కార్పొరేటర్ శేఖర్ రెడ్డిలు పర్యటించారు. ఖాధీ కాలనీ ప్రధాన రహదారిలో జగన్మాత చర్చ్ ముందర నుండి ప్రకాశం పార్క్ వరకు వెలుతున్న 40 అడుగుల రహదారి 30 అడుగులకు కుంచించుకు పోవడంతో తిరిగి 40 అడుగుల వుండేలా వెడల్పు చేస్తున్నట్లు కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ ప్రకటించారు. సుమారు 50 మందికి టిడిఆర్ బాండ్లు రిలీజ్ చేసి వారందరి సహకారంతో రోడ్డు వెడల్పు కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 42వ డివిజన్లో కొత్తగా 20 అడుగుల రోడ్డును పై వైశ్రాయ్ ప్రక్కనుండి కపిలతీర్థం రోడ్డును కలుపుతూ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపి బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

తిరుపతి సిటీ : మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షులు బ్రిజ్‌భూషణ్ను వెంటనే అరెస్టు చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి పి.వెంకటరత్నం డిమాండ్‌చేశారు. శనివారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మహిళల మానప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా ప్రధాని మోడీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, రాజగోపాల్, మునికుమార్, లోకేష్, మహేష్, తుపాకుల లత పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కులు

తిరుపతి టౌన్ : ఉద్యోగులు తమ హక్కులను ఉద్యమాలతోనే సాధించుకోవాలని దీపా నాయక్ పేర్కొన్నారు. అఖిలభారత ఎల్ఐసి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల త్రై వార్షిక జోనల్ మహాసభలు తిరుపతిలో ఘనంగా జరిగాయి. ఈ మహాసభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆల్ ఇండియా అధ్యక్షుడు దీప్లా నాయక్ మాట్లాడుతూ ఉద్యోగుల సమైక్య పోరాటంతోనే విజయం సాధించగలమన్నారు ఎల్ఐసిలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడతామన్నారు. ఎల్ఐసి ఉద్యోగుల సీనియర్ డివిజన్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ ఎల్ఐసి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తోందన్నారు. ఈ విషయంలో ఉద్యోగుల పాత్ర ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బి శ్రీనివాసులు, డి .చెన్నయ్య , ఎం రామయ్య , కొట్టు గోపి ,చెన్నయ్య ,చంద్రమౌళి ,వెంకట ముని పాల్గొన్నారు.

ఇద్దరికి హోంగార్డులుగా కారుణ్య నియామకం

తిరుపతి సిటీ : విధులు నిర్వహిస్తూ ప్రమాదం కారణంగా ఒకరికి, అనారోగ్యంతోనూ మృతిచెందిన వారి కుటుం బంలోని ఒకరికి కారుణ్య నియామకాల కింద ఇద్దరిని హోం గార్డులుగా నియ మించినట్లు ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. హెచ్‌జి 134 జి.గోవిందరెడ్డి భార్య నిర్మలకు, హెచ్‌జి 1668 ఎస్.విజయ్‌కుమార్ కొడుకు ఎస్.తరుణ్‌క్రిష్ణకు కారుణ్య నియామకాల్లో అవకాశం లభించింది. వారికి ఉద్యోగ ఉత్తర్వుల పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి వెంకట్రావు, హోంగార్స్ డిఎస్‌పి లక్ష్మణ్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాసులు, జోయల్ పాల్గొన్నారు.

బదిలీలు...ఒట్టిమాటే..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రభుత్వం ఉద్యోగులను బదిలీ చేస్తున్నామంటూ ఆర్భాటంగా ప్రకటించింది.. కార్యాచరణకు నోచుకోలేదు. తిరుపతి జిల్లా పోలీసులకు మినహా ఎవరికీ బదిలీ అనేది జరగలేదు. ఉమ్మడి జిల్లాలో గ్రామ కార్యదర్శులు 1850 మంది ఉన్నారు. ఒక్కరంటే ఒక్కరూ బదిలీ కాలేదు. ఐదు చోట్లకు ఆప్షన్లు పెట్టుకున్నా మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నారు. మహిళా పోలీసు, అసిస్టెంట్లు, వెల్ఫేర్ అధికారుల బదిలీలు జరగలేదు. 2019లో సచివాలయ ఉద్యోగులకు మొదటి విడతగా నియమించింది. ఆ తరువాత రెండు విడతలుగా నియమించింది. ఐదేళ్లు పూర్తయితే గానీ బదిలీ లేదని కొర్రి పెట్టడంతో సచివాలయ ఉద్యోగులు ఎవరికీ బదిలీల్లేవు. మొదటి విడతలో ఎంపిక చేసిన సచివాలయ ఉద్యోగులు అందరికీ బదిలీల్లో మినహాయింపు ఉంటుందని అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. అలాగే ఉమ్మడి జిల్లాలో 165 మంది ప్రత్యేక ప్రతిభావంత ఉద్యోగులు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతోనూ వీరు ఇబ్బందులు పడుతున్నారు. వీరికి సరైన ప్లేస్‌మెంట్ ఇవ్వాలని, మొదటి ప్రాధాన్యత బదిలీల్లో కల్పించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ప్లేస్‌మెంట్‌లేదంటూ ప్రభుత్వాధికారులు కొర్రి పెడుతున్నారు. అలాగే భార్యాభర్తలు ఒకేచోట పనిచేసేవారు, అనారోగ్య సమస్యల కారణాలతో ఉమ్మడి జిల్లాలో 10,500 మంది ఉన్నప్పటికీ వారికీ ఎలాంటి అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగులు, ఇతరత్రా శాఖల అధికారులు ఆందోళన బాట పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే చంద్రగిరిలో తమను బదిలీలు చేయాలంటూ శుక్రవారం ఆందోళనకు దిగారు. స్కూళ్లు తెరచేలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ స్థానిక ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధులు వారికి కావాల్సిన ఉద్యోగులను బదిలీ చేయకుండా అడ్డుపడడంతో ప్లేస్‌మెంట్ లేకుండా వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు అనువైన స్థానాలకు వెళ్లలేకపోతున్నారు. ఏదిఏమైనప్పటికీ ప్రభుత్వం చెప్పిందొకటి, చేసిందొకటి అని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

దొంగతనాలకు పాల్పడే ముద్దాయి అరెస్టు

తిరుపతి సిటీ : రాత్రిపూట ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముద్దాయిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి పి.పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నంకు చెందిన బోడబతుల శ్రీను అలియాస్ నల్ల శ్రీను (34) మంగళం వద్ద నివాసం ఉంటూ తిరుపతి పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడేవాడన్నారు. అతనినుంచి 40 లక్షల విలువైన 793 గ్రాముల బంగారు ఆభరణాలు, 1235 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడి అరెస్టు, సొత్తు స్వాధీనానికి సహకరించిన పోలీసులను అభినందించారు. ఏఎస్పీ వెంకట్రావు, తిరుపతి డిఎస్పి సురేంద్ర రెడ్డి, అలిపిరి పోలీస్ స్టేషన్ సిఐ అబ్బన్న పాల్గొన్నారు.

6న తిరుపతిలో 'ఆదిపురుష్' ప్రీరిలీజ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఇతిహాస గ్రంథం రామాయణం ఆధారంగా తెరకెక్కిన లేటెస్ట్ పాన్ ఇండియన్ మూవీ 'ఆదిపురుష్' డైరెక్టర్ ఓం రౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పిరియాడిక్ వండర్ కోసం ఆడియెన్స్ ఎదురు చూస్తున్నారు. ఈ నెల 16న గ్రాండ్ రిలీజ్ కానున్న నేపథ్యంలో ఈ సినిమా నుండి వరుసగా అప్డేట్ లను ఇస్తూ మరింత క్రేజ్ పెంచుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ఆంధ్రాలో తిరుపతి వేదికగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేసిన విషయం తెలిసిందే.. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ స్టేడియంలో జరగనుందని జూన్ 6న సాయంత్రం 5 గంటల నుండి ఈ ఈవెంట్ స్టార్ట్ అవుతుందని మేకర్స్ అనౌన్స్ మెంట్ ఇచ్చారు. దీంతో ఈ బిగ్గెస్ట్ ఈవెంట్ కోసం ఫ్యాన్స్ రెడీ అవుతున్నారు. మరి ఎలాంటి అవాంతరాలు లేకుండా ఈ ఈవెంట్ ను ఎలా పూర్తి చేస్తారో వేచి చూడాలి..

ఇంతకు ముందు నెగిటివ్ టాక్ వచ్చిన ట్రైలర్ రిలీజ్ తర్వాత ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి.. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ సినిమాను టి సిరీస్ సంస్థ, రిట్రో ఫైల్స్ 500 కోట్ల భారీ బడ్జెట్ తో సంయుక్తంగా నిర్మించారు. ప్రభాస్ రాముడిగా కతి సనన్ సీత పాత్రలో నటిస్తున్న విషయం విదితమే.. అలాగే సైఫ్ అలీ ఖాన్ రావణాసురిడిగా నటిస్తుండగా.. సన్నీ సింగ్ లక్ష్మణుడిగా నటిస్తున్నాడు.

స్థానిక ఆలయాల్లోనూ పరిశుభ్రత : జెఇఒ

తిరుపతి సిటీ : శ్రీవారి ఆలయం తరహాలో స్థానికాలయాల్లోనూ పరిశుభ్రత పాటించాలని జెఇఒ వీరబ్రహ్మం ఆదేశించారు. ఆలయాల నిర్వహణ, అభివృద్ధి అంశాలపై శనివారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు.

'చేతిరాత' రారాజు...!

'ప్రజాశక్తి'తో సంగరాజు భాస్కర్‌రాజు

'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు' అన్నాడొక మహాకవి.. గట్టి సంకల్పంతో 'అక్షరాన్ని' నమ్ముకున్నాడు.. 'చేతిరాత'ను అందంగా మలచడంలో శాస్త్రీయ పద్ధతిని అవలంబించాడు. మారుమూల గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో పెరిగారు. విషాదాలు, ఒడిదుడుకులు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి ఇవేమీ ఆయన సంకల్ప బలం ముందు నిలవలేదు. 'చదవడం రాదు' అనేవారు ఎవ్వరూ ఉండకూడదనే లక్ష్యంతో ఆ దిశగా అహర్నిశలు కృషి చేసి విజయం వైపు అడుగులేస్తూ చదువుపైన రీసెర్చి చేశారు. చదువులు డాక్టర్ అయ్యారు మన సంగరాజు భాస్కర్‌రాజు. తన ఐదో ఏటే తల్లి చనిపోయింది.. కాకతాళీయమే అయినా భాస్కర్‌రాజు పెళ్లయిన నాలుగేళ్లకే మొదటి భార్య మృతిచెందింది. అయినా ఏ లోటూ లేకుండా బిడ్డలను పెంచి పెద్ద చేశారు ఆ తండ్రీ కొడుకులు. న్యూ బాలాజీకాలనీలోని మేక్‌మై బేబీ జీనియస్ స్కూలులో తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతికి సమీపంలోని వడమాలపేటకు కూతవేటు దూరంలో ఉన్న ఓబులరాజు కండ్రిగ మా ఊరు. ఎస్.వెంకటరమణరాజు, మంగమ్మ నా తల్లిదండ్రులు. నేను రెండో సంతానం. మాది పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబం. నా చిన్న వయస్సులోనే మా అమ్మ మరణించింది. అప్పటినుంచి మా అక్కకు, నాకు నాన్నే అన్నీ. మా మేనత్త సహకారంతో మమ్మల్ని పెంచి పెద్ద చేశారు. ఎస్‌విపురం, తిరుమణ్యం, వడమాలపేట స్కూళ్లల్లో పదో తరగతి వరకు నా చదువు సాగింది. గూడూరు పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తి చేశాను. 1991లో ఎస్వీయూలో బిటెక్ చేరి అనివార్య కారణాలతో చదువు ఆపేశాను.

మొదటినుంచి సమాజం నాకేమిచ్చింది అనే దానికన్నా సమాజానికి నేనేమివ్వాలనే ధోరణితోనే ఉండేవాన్ని. వడమాలపేట వద్ద పదో తరగతి ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ట్యూషన్ ఏర్పాటు చేశాను. చుట్టుపక్కల గ్రామాల్లోని పిల్లలకు చదువుపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. పదో తరగతి పాస్ అయితే చాలనుకునేవారు. అలాంటిది పదో తరగతి ఫెయిలైన వారికి శిక్షణ ఇచ్చి, సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రథమశ్రేణిలో అందరూ పాస్ అయ్యేలా కృషి చేశాను. ఇది నా తొలి విజయం. ఈ విజయమే విద్యాసంస్థ ప్రారంభానికి తొలి బీజం పడింది. 1992లో వడమాలపేట కేంద్రంగా అశ్వనీ టాలెంట్ స్కూలును స్థాపించాను. 1995లో మంజులతో నా వివాహం అయ్యింది. మాకు యశ్వంత్, అశ్వినీ పిల్లలు. 1999లో నా భార్య మంజుల మృతిచెందింది. మూడేళ్లు కూడా దాటని ఇద్దరు పిల్లల ఆలనా పాలన చూసుకుంటూనే విద్యాసంస్థను కొనసాగించారు.

ఆ సమయంలో ప్రచార మాధ్యమాల ద్వారా ఎన్ఎల్‌పి (న్యూరో లింగ్విస్టిక్ ప్రొగ్రామ్) గురించి తెలుసుకుని, ఒంగోలులో నెల్లూరు రాఘవరరాజు వద్ద ఆ కోర్సు పూర్తి చేశాను. అదే సమయంలోనే నాకు హ్యాండ్‌రైటింగ్ ఆలోచన వచ్చింది. రీసెర్చ్ ప్రారంభించాను. నా స్కూల్ విద్యార్థులకు హ్యాండ్‌రైటింగ్‌లో శిక్షణ ఇవ్వడంతో. చదువుకునే 30 మంది పదో తరగతి విద్యార్థులందరూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించేలా చూశాను. అప్పట్లో ఇది జిల్లాకే గర్వకారణంగా నిలిచింది.

హ్యాండ్‌రైటింగ్‌పై ప్రత్యేక శిక్షణ

పిల్లలు ఎంత చదువుకున్నా, ఎంత నేర్చుకున్నా... చక్కని చేతిరాత లేకపోతే చదివిందంతా బూడిదలో పోసిన పన్నీరే. అందుకే 2000 సంవత్సరంలో తిరుపతి పెద్దకాపు వీధిలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పిల్లలకు హ్యాండ్‌రైటింగ్‌పై శిక్షణ ప్రారంభించాను. 2005లో మైకెలాజిలెవోరీ రచించిన హోల్ బ్రెయిన్ పవర్ అనే పుస్తకాన్ని చదవడం ద్వారా 10 రకాల స్లేట్ ప్యాటర్న్ రూపొందించి నా పిల్లలకే శిక్షణ ఇచ్చాను. అనతికాలంలోనే వారి మేథోశక్తి పెరగడంతో విజయం సాధించాను. నా ప్రయోగాలన్నీ మొదట నా పిల్లలపైనే ప్రయోగించేవాన్ని. అందుకు వారి సహకారం వందశాతం ఉండేది. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి 'హ్యాండ్‌రైటింగ్'పై అవగాహన కల్పించేవాన్ని. పిల్లల ఆలనాపాలన ఇబ్బంది కావడంతో తండ్రి వెంకట రమణరాజు ప్రోద్బలంతో 2009లో వివాహం చేసుకున్నాను. మంజునాథ్ జన్మించాడు. 2009-10లో పదో తరగతి విద్యార్థులకు 500 మార్కులు పైన వచ్చాయి. ఆ స్థాయిలో మార్కులు రావాలంటే 'హ్యాండ్‌రైటింగ్' ఖచ్చితంగా ఉండాలని తల్లిదండ్రుల్లో నమ్మకం కుదిరింది. చేతిరాతే కాదు కుడినుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి, కింద నుంచి పైకి, పైనుంచి కిందకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ముత్యాల్లాంటి అక్షరాలు నేర్పించడంలో సక్సెస్ అయ్యాను. అనేక రికార్డులను సొంతం చేసుకున్నాను. మా పిల్లలే నా 'సంకల్పానికి' ఊతమిచ్చి భాగస్వామ్యం అయ్యారు. గిన్నీస్‌బుక్, వండర్‌బుక్, లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స వంటి అనేక రికార్డులను మా అమ్మాయి అశ్వనీ కైవసం చేసుకుంది. మొత్తం 32 రికార్డులను సొంతం చేసుకుంది. చిన్నకొడుకు మంజునాథ్‌కు 13 రికార్డులు వచ్చాయి. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి 'చదువుల డాక్టర్'గా పేరు గడించడం ఎంతో గర్వంగా ఉంది. 2014లో అన్నారావు సర్కిల్ సమీపంలో 'భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చి సెంటర్'ను ప్రారంభించాను. వీరికి చదువు రాదు, బాగా రాయడం రాదు 'మొద్దు' అని ముద్ర వేసిన వారిలో ప్రతిభను వెలికి తీయడమే మా పని. 2009లో రూపొందించిన 'ప్యాటర్న్'కు పేటెంట్ హక్కు 2023, ఏప్రిల్ 13న వచ్చింది. ఇటీవలే న్యూ బాలాజీ కాలనీలో ఎంఎంబిసి రెండో బ్రాంచి ప్రారంభించాను. వేసవి సెలవుల్లోనూ, ఆదివారాలపుడు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. మెటీరియల్స్, మై ఎఐ టీచర్ యాప్‌ను ఉచితంగా అందిస్తున్నాను. 'అందమైన చేతిరాతతో అందమైన భవిష్యత్' తీర్చిదిద్దాలన్న నా సంకల్పం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ అందించాలన్నది ప్రస్తుత నా లక్ష్యం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ నా శిక్షణను కొనసాగిస్తాను.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మం డలం తాల్వాయిపాడు గ్రామంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లు కన్వర్షన్ చేసుకొని ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి, గ్రామానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆస్తిని కాజేస్తున్న విషయమై ప్రజాశక్తిలో పరిశీలనాత్మక కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన తహశీల్దారు రామయ్య తన సిబ్బందితో కలిసి శనివారం అక్రమ వెంచర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే పక్కన టాపే ట్రాక్టర్ షోరూం వెనుక 1.67 ఎకరాల భూమికి కన్వర్షన్ పొంది అంతకుమించి ప్లాట్లు వేశారని, ప్రభుత్వ భూమి (అసైన్మెంట్ భూమి)లో 22 అడుగుల వెడల్పుతో లక్షలు విలువ చేసే భూమిలో రోడ్డు నిర్మించినట్లు గుర్తించారు. ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

రామారావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో కులం పేరుతో దూషిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా జరిగింది. సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి వెంకటగిరి మున్సిపాలిటీ లోనే తిష్ట వేసి దళిత కార్మికుల్ని కులం పేరుతో దూషిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న రామారావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు వెంకటగిరి మండల ఉపాధ్యక్షులు ఉదయభాస్కర్, లీలావతి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు సుబ్బయ్య, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ పెంచలయ్య , జాయింట్ సెక్రటరీ లక్ష్మమ్మ, కోశాధికారి మోహన్, ఉపాధ్యక్షులు ప్రసాద్ , సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు హరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రూ.20 వేలు వేతనమివ్వాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ డిమాండు చేశారు. శనివారం గూడూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు తగినంత వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దుగరాజపట్నం ఓడరేవుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, పోర్టు నిర్మాణం ద్వారా గూడూరు డివిజన్ ఎంతో అభివద్ధి చెందుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దుగరాజపట్నం పోర్టు నిర్మాణం ఖచ్చితంగా ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి ఇన్‌ఛార్జీలు శ్రీనివాసులు రెడ్డి, చంద్రశేఖర్ , భాస్కర్‌రెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో గోపిరాయల్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఏపీ రాష్ట్ర కాపు సంక్షేమ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, పుత్తూరు జనసేన పార్టీ నాయకులు గోపిరాయల్ 53వ జన్మదిన వేడుకలను శనివారం స్థానిక శ్రీశ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ, రష్ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుచానూరు మాజీ సర్పంచ్ సి.ఆర్.రాజన్, అలాగే బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల సమక్షంలో కేక్ కోసి పంచి పెట్టారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు కష్ణయ్య, నాగూర్, రామచంద్రరాజు, ప్రసాద్, రాజేంద్ర, రవికుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, రఘుపతి, ఆనందబాబు, బాషారాయల్, మోహన్ రాయల్, ఆలయ పూజారి గోపాల్ స్వామి, పెరుమాళ్ ఆచారి, ధనుంజయులు యాదవ్, సతీష్‌శెట్టి, టైలర్ రవి, బాలకృష్ణ యాదవ్, సి.ఎస్.అంబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం కదిరిమంగళం పంచాయతీలో ఇటీవల మతిచెందిన శివకుమార్ కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్టు నుంచి రూ.50 వేలు, వైఎస్సార్ బీమా రూ.లక్ష, ఓ ఇంటి స్థలం మంత్రి ఆర్కే రోజా సోదరులు రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. పార్టీ అండదండలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీవారి దివ్యతేజం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం అప్పలా యగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శనివారం ఉదయం స్వామివారు శ్రీ రాజమన్నార్ అలంకారంలో కల్పవక్ష వాహనంపై దర్శమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడ వీధుల్లో కోలాహలంగా వాహనసేవ జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం జరిగింది. రాత్రి సర్వ భూపాల వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శన మిచ్చారు. సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

ప్రచారంలో అత్యంత శక్తివంతంగా సోషల్ మీడియా

సోషల్ మీడియా సమీక్ష సమావేశంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుచానూరు: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు పరిచయం చేయాలన్నా, ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను తిప్పి కొట్టాలన్నా సోషల్ మీడియాను అస్త్రంగా చేసుకోవాలని.. చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్ నేతత్వంలో తిరుచానూరు వద్దనున్న ఓ ప్రయివేటు హోటల్‌లో శనివారం తిరుపతి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ల సమీక్ష సమావేశం జరిగింది. స్టేట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్ సమావేశంలో మాట్లాడుతూ సోషల్ మీడియా వాలంటీర్లను కలవడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి సోషల్ మీడియా వాలంటీర్లు రాష్ట్రంలో నెంబర్ వన్ గా ఉన్నారన్నారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీ ప్రచారంలో మీడియా కంటే సోషల్ మీడియా అతిశక్తి వంతంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పత్రికల సర్క్యులేషన్ సుమారు 20 లక్షలు ఉంటే సోషల్ మీడియాలో రెండు కోట్ల మంది చూస్తుంటారని స్పష్టం చేశారు. అయితే సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థి పార్టీలకు కౌంటర్లు ఇవ్వడానికి పరిమితం కాకుండా ప్రజలకు జగనన్న చేస్తున్న మంచి పనులను చేరువయ్యేలా చూడాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. గత ఎన్నికల్లో సోషల్ మీడియా పనిచేసిన విధానం బాగుందని, అంత కంటే ఎక్కువగా కష్టపడి పనిచేస్తే మరోసారి అతి సులభంగా జగనన్నను ముఖ్యమంత్రిని చేయవచ్చని చెప్పారు. చివరగా పార్టీ తరపున నియమించిన గృహ సారథుల సాయంతో వాట్సాప్ నెంబర్లను సేకరించి ప్రతి పంచాయతీలో యువతను పార్టీకి పరిచయం చేసేలా సోషల్ మీడియా కన్వీనర్లు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నేదురుమల్లి రామకుమార్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆర్మీ అంటే సోషల్ మీడియా కార్యకర్తలేనన్నారు. మరింత చురుగ్గా సోషల్ మీడియా కార్యకర్తలు రానున్న 9 నెలలు పనిచేయాలన్నారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్ ఎప్పటికప్పుడు ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం తిప్పి కొట్టాలన్నారు. గ్రామ స్వరాజ్యం తీసుకు వచ్చిన ఏకైక సీఎం దేశంలో జగన్ మోహన్ రెడ్డి ఒక్కరే అని ఉద్ఘాటించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కోనేటి ఆది మూలం, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, చల్లా మధుసుధన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేకటేశ్వర విశ్వ విద్యాలయం రసాయన శాస్త్ర పరిశోధ కురాలు రాళ్లపాటి ప్రతిభకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్యులు డాక్టర్ ఎన్వివి జ్యోతి గారి మార్గదర్శకత్వంలో "ఎక్సెస్ థర్మో డైనమిక్ అండ్ స్పెక్ట్రోస్కోపిక్ స్టడీస్ ఆఫ్ ఆర్గానిక్ లిక్విడ్ మిక్చర్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను ఆమెకు డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసినట్లు వివరించారు. పలువురు ఆచార్యులు, పరిశోధకులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు పిల్లమేడు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-తొట్టంబేడు: జాతీయ ఉపకార వేతనానికి (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్) మండలంలోని పిల్లమేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని మోదుగుల.జాహ్నవి ఎంపికైంది. జాతీయ స్థాయిలో తీవ్ర పోటీ ఉన్నా తమ పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడం గర్వకారణమని ప్రధానోపాధ్యాయుడు అహ్మద్ అలీ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాహ్నవిని ఉపాధ్యాయ బందం శనివారం అభినందించి, ఘనంగా సత్కరించారు. పాఠశాలలో విద్యార్థులకందజేస్తున్న గుణాత్మక విద్య కారణంగానే తమ విద్యార్థి జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అలీఖాన్ చెప్పారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి ప్రగతికి తోడ్పాటు అందిస్తున్నామని ప్రజాప్రగతి ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం ప్రజాప్రగతి ట్రస్ట్ భవన్ కార్యాలయంలో వరదయ్యపాలెం, శ్రీకాళహస్తి, కేవీబీపురం మండలాల్లోని సుమారు 50 మంది వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సాయంత్రం ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్నామని.. పల్లెల్లో ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో శిక్షణ పొందిన వాలంటీర్లు పిల్లలను చదువుపై ఆసక్తి కలిగించేలా ఆటపాటలతో వారికి సాయంత్రం ప్రత్యేకత నిర్వహించి నైపుణ్యాలు మెలకువలు నేర్పించి పట్ల ఆసక్తి కలిగించే విధంగా తరగతుల నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ సుస్మిత, కోఆర్డినేటర్లు సుబ్రమణ్యం, చంద్రశేఖర్, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

5న ఎస్‌కెఆర్‌లో జాబ్‌మేళా

ప్రజాశక్తి-గూడూరు టౌన్: స్థానిక ఎస్.కె.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ చదివి 25 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. జీతం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుందన్నారు. వివరాలకు 95661 77753 ఫోన్‌నంబరును సంప్రదించాలని కోరారు.

రైలు ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-బాలాయపల్లి: ఒరిస్సా రైలు ప్రమాదంలో బాలాయపల్లి మండలానికి చెందినవారు ఎవరైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే సాయం అందిస్తామని తహశీల్దారు శ్రీనివాసరావు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, వాలంటీర్లు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.

కోట : ఒరిస్సాలో జరిగిన రైలు ప్రమాదంలో కోట మండలానికి చెందిన బాధితులు ఎవరైనా ఉంటే వివరాలను కోట తహశీల్దారు కార్యాలయంలోనూ, గ్రామ సచివాలయంలో సమాచారం ఇవ్వాలని తహశీల్దారు పద్మావతి తెలిపారు.

దిగజారుడు రాజకీయాలతో పార్టీ ప్రతిష్టకు భంగం

ప్రజాశక్తి-నాయుడుపేట: అన్నివిధాలా అభివృద్ధి చెందిన పంచాయతీలను పక్కన పెట్టి అర్హత లేని పంచాయతీలను జాతీయ స్థాయి అవార్డులకు ఎంపిక చేయడంలో అధికారుల వైఫల్యం ఉందని..కొందరు దిగజారుడు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో నామమాత్రంగా అభివృద్ధి చెందిన పంచాయతీలకు అవార్డులు కట్టబెట్టారని.. స్వచ్ఛభారత్ అవార్డులకు ఎంపిక చేసిన పంచాయతీ అవకతవకలపై వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్ట సుధాకర్ రెడ్డి శనివారం మేనకూరులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అధికారులపై ధ్వజమెత్తారు. దేశంలోని గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో ముందుకెళ్లేందుకు ఆయా గ్రామ నాయకులను ప్రోత్సహించేందుకు అభివద్ధి చెందిన పంచాయతీలను ఎంపిక చేసి పక్క గ్రామాలు అభివద్ధి చెందేందుకు దోహద పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇలాంటి వాటిలోనూ అవకతవకలకు తావివ్వడం.. అభివృద్ధిని ఆటంక పరచడమేనని, అవార్డులు రానందుకు తమకు విచారం లేదని.. ఇప్పటికే తమ గ్రామానికి మూడు అవార్డులు వచ్చాయని.. మేనకూరు కంటే కాదలూరు ఏ విధంగా అభివృద్ధి చెందిన గ్రామమో తెలియజేయాలని కోరారు. తమ గ్రామం కంటే ఆ గ్రామం అభివృద్ధి చెందినదిగా తేలితే బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి సిద్ధమన్నారు. తాను పార్టీ మారుతున్నానని అసత్య ప్రచారాలు చేస్తున్నారని.. పార్టీయే ప్రాణంగా జగన్మోహన్ రెడ్డి కోసమే పనిచేసే వ్యక్తులమని.. వలస వచ్చిన టీడీపీ వ్యక్తులు పార్టీకి పార్టీ విధానాలకు ప్రజల్లోకి వెళ్లనీయకుండా ఆటంకాలు కలిగించేలా వారి విధానాలున్నాయని తెలిపారు. మేనకూరు సర్పంచ్ సి హెచ్.సురేష్, నల్లు.కస్తూరయ్య, ఎస్ కె.రఫీ, అత్తికాయల నరేంద్ర పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-గూడూర్ టౌన్: గూడూరు రెండోపట్టణ పరిధిలోని సిరామిక్ కళాశాల వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు , స్వచ్ఛాంధ్ర సంస్థ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి భూమిపూజ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ14 ఏళ్లుగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు సీఎం జగన్మోహన్ రెడ్డి చొరవతో ప్రారంభమవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పురపాలక సంఘం మాజీ ఛైర్‌పర్సన్ మంజుల, నాయకులు కోడూరు మీరారెడ్డి, బత్తిన విజయ్ కుమార్, నాశిన నాగులు, తాళ్లూరు శ్రీనివాసులు, జడ్పీటీసీ సభ్యురాలు యామిని, మునిసిపల్ కమిషనర్ సాయినాథ్, సతీష్‌రెడ్డి, సాయి, ఇమ్రాన్, గోపాల్ యాదవ్, అజీజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గూడూరు: రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ అసనాపురం వెంకటేష్ ఆధ్వర్యంలో మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ జన్మదిన వేడుకలను గూడూరులో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురమయ్య, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు తాతపూడి ఇజ్రాయిల్ కుమార్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్, నాయకులు తేజ యాదవ్, భాను, చంద్రమోహన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కోట : మాజీ టీడీపీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మంచి మనస్సున్న వ్యక్తి అని కోట టీడీపీ నాయకులు కొనియాడారు. శనివారం కోటలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కారు స్టాండ్ వద్ద భారీ కేక్ ను కోసి నాయకులు, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం 500 మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో నెల్లూరు మోహన్ రెడ్డి, తూపిలి రాధాకష్ణారెడ్డి, కోట టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్, కోట ఎంపీటీసీలు ఎస్ కే శంషుద్దీన్, దారా సురేష్, మాజీ మండల ఉపాధ్యక్షులు కోకర్ల మధుయాదవ్, పోలయ్య నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

రూ.79.05 కోట్లతో అభివృద్ధి పనులు

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి అర్బన్: తిరుపతి రూరల్ మండలంలో రూ.79.05 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని.. ప్రజా ప్రతినిధులు ఆరోగ్య పరిరక్షణకు తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చొరవ తీసుకున్నారని.. పంచాయతీల పరిధిలో సర్పంచులు, ఎంపీటీసీలు ఆరోగ్యంగా ఉంటే ప్రజలకు మరింత సేవ చేసేందుకు అవకాశం ఉంటుందని భావించారని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రూ.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు ప్రజాప్రతినిధుల (భార్య, భర్త)కు వర్తింపజేసేలా వైద్య బీమా ప్రీమియంకు రూ.9 లక్షలు తన సొంత నిధులు చెల్లిస్తున్నానన్నారు. బీమా ప్రీమియం ప్రతిని సర్పంచ్ లు, ఎంపీటీసీలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అందజేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మండల పరిధిలో 34 మంది సర్పంచులు, 39 మంది ఎంపీటీసీలకు సొంత నిధులు రూ.9 లక్షలతో ఉచిత వైద్య బీమా సదుపాయాన్ని కల్పించడంపై అభినందనలు అందుకున్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సైతం ఎంపీపీ మోహిత్ రెడ్డి కషిని అభినందించారు. 50 సంవత్సరాల కాలంలో జరగని అభివద్ధిని నేడు చేసి చూపామన్నారు. ప్రజలకు మంచి చేయడంలో అందరూ పోటీ పడాలని పిలుపునిచ్చారు. రోడ్లు, కాలువలు, ధ్యాన మందిరాలు, సమావేశ మందిరం, రచ్చ బండలు, జిమ్ లు , పార్కులు తదితర పనులను రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా చేపట్టామన్నారు. మండల సమావేశానికి ముందస్తు సమాచారం ఇచ్చినా గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. హాజరు కాని అధికారులపై చర్యలకు జిల్లా కలెక్టర్ కు ప్రతిపాదించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు విడుదల మాధవ రెడ్డి, యశోద, ఎంపీడీవో వెంకట నారాయణ, అర్బన్, రూరల్ తహశీల్దార్లు వెంకట రమణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

62 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కడప జిల్లా సిద్దవటం, రాజంపేట, తంబళ్లపల్లి ప్రాంతాల్లో జరిగిన మూడు సంఘటనల్లో 62 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకోవడంతో పాటు, 5 మంది స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు రేంజి డీఐజీ ఎస్.సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు ఆధ్వర్యంలో మూడు బందాలు శుక్రవారం నుంచి కూంబింగ్ చేపట్టాయని అధికారులు తెలిపారు. రైల్వేకోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కపానంద బందం, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మౌనికతో కలిసి సిద్దవటం రేంజ్, ముత్తుకూరు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా శనివారం ఉదయం 4 గంటల సమయంలో దబ్బకోన ఫారెస్ట్ ఏరియా చేరుకోగా కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టగా దుంగలను పడేసి చీకట్లో పారిపోయారన్నారు. అయితే 5 మంది స్మగ్లర్లను పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వారిని నెల్లూరు జిల్లా మర్రిపాడుకు చెందిన చిల్పం సాంబయ్య (44), యడమకంటి రమణయ్య (53), కడప జిల్లా కుంటగిరికి చెందిన ముద్దా నరసింహులు (46), ఖాజీపేటకు చెందిన నక్కా వెంకటేష్ (62), బందేవేల్ టౌన్ కు చెందిన వనం చెన్నయ్య (70)లను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 753 కిలోల బరువు గల 26 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా ఆర్ఐ కే.సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బందం అన్నమయ్య జిల్లా పుల్లంపేట తుమ్మలబైలు సెక్షన్ నుంచి కూంబింగ్ నిర్వహిస్తుండగా కరుకు ఏరు ప్రాంతం వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారని వీరిని హెచ్చరించి చుట్టుముట్టే లోపు దుంగలను పడేసి పారిపోయారన్నారు. ఆ ప్రాంతంలో 8 ఎర్రచందనం దుంగలు, మరో సంఘటనలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ పి. నరేష్ బందం పోరుమామిళ్ల మండలం, తంబళ్లపల్లి సెక్షన్ నుంచి కూంబింగ్ నిర్వహిస్తుండగా నాగలకుంట్ల పోస్టు, రామేశ్వరం గ్రామంలో రాచకొండ రామయ్య ఇల్లు గ్రామం చివర ఉండటంతో అనుమానం వచ్చి అక్కడుకు చేరుకున్న టాస్క్ ఫోర్సు సిబ్బందిని చూసిన రామయ్య అక్కడ నుంచి పారిపోయాడని, అతను ఇదివరకు ఫారెస్ట్ వాచర్ గా పనిచేసినట్లు తెలుసుకున్నామన్నారు. ఇంట్లో సోదా చేయగా 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మూడు సంఘటనల్లో మొత్తం 62 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.60లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ మూడు కేసులను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో నమోదు చేయగా, సిఐ బాలకష్ణ, ఎస్ఐ మోహన్ నాయక్ విచారిస్తున్నారన్నారు. ఈ ఆపరేషన్లలో పాల్గొన్న బందాలకు డీఐజీ సెంథిల్ కుమార్ రివార్డులు ప్రకటించారు.

ధనమ్మ మృతికి నివాళులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మున్సిపాలిటీలోని 3 వార్డుకు చెందిన ధనమ్మ శనివారం మతిచెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గిరిజనుడి మృతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తడుకు పంచాయతీ టీఆర్ కండ్రిగ ఎస్టీ కాలనీ (గుండాల కాలనీ)లో గత 4 నెలలుగా విద్యుత్ శాఖ అధికారులకు ట్రాన్స్‌ఫార్మర్ సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో శనివారం సుబ్రహ్మణ్యం(45) విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యుత్తుశాఖ అధికారులు పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విచారించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను కలిసిన షేక్ మొబీన్‌బాషా

ప్రజాశక్తి-కోట: గూడూరు నియోజకవర్గ మసీదుల కమిటీ అధ్యక్షుడు, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మొబీన్ బాషా డిప్యూటీ సీఎం, రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి షేక్ అంజాద్ బాషాను గుంటూరు నంబూరు మదర్సాలో హజ్ యాత్రికుల బస ఏర్పాట్లు, పర్యవేక్షణ సమయంలో కలిశారు. షేక్ సిరాజ్, షేక్ ఇలియాజ్ తదితరులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

పక్కాగృహాల నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి-బాలాయపల్లి: పక్కాగృహాల పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీడీవో రవీంద్రబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని అలిమిలి, గొట్టిపాడు, అంబాలపూడి గ్రామాల్లో ఉన్న జగనన్న లేఔట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కాగహాల పనులు వెంటనే ప్రారంభించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత హౌసింగ్ శాఖ అధికారులకు ఉందన్నారు. ఇక జయంపు గ్రామంలో జరుగుతున్న ఆధార్ సెంటర్ ను పరిశీలించారు. హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాకాల: దామలచెరువు మ్యాంగో లయన్స్ నూతన కార్యవర్గాన్ని శనివారం రీజనల్ ఛైర్మన్ కేఎస్ మస్తాన్, జిల్లా ఛైర్మన్ రామయ్యల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగూర్‌బాషా, సెక్రెటరీగా ఆనంద్, కోశాధికారిగా రెడ్డిబాషా, ఉపాధ్యక్షులుగా లయన్ కుమార్, ఆర్‌పీ నాగూర్‌లను ఎంపిక చేశారు.